క్లుప్తంగా

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి కాకినాడ జిల్లా తునికి చెందిన ఎస్.సత్యనారాయణమూర్తి రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఆలయ అధికారి సతీష్‌మాలిక్‌ను కలసి ఈమేరకు విరాళం అందజేశారు. దాతకు ప్రత్యేక దర్శనం కల్పించారు.

పౌష్టికాహార లోపంతో రక్తహీనత

ఏర్పేడు: కిశోర బాలికల్లో పోష్టికాహార లోపంతో రక్త హీనత కలుగుతుందని అంగన్‌వాడీ సూపర్ వైజర్ పావని తెలిపారు. శనివారం పల్లం ఉన్నత పాఠశాలలో కిశోర బాలికలకు రక్తహీనతపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లుతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు.ప్రధానోపాధ్యాయుడు బాలాజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామాలయానికి భూమి పూజ



ఏర్పేడు: మండలంలోని పెన్నగడంలో నూతన రామాలయ నిర్మాణానికి శనివారం వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్ రెడ్డి భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి ఆదేశాల మేరకు దేవదాయశాఖ అధికారులు రూ.10 లక్షల నిధులు మంజూరు చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు తిరుమలయ్య, సర్పంచ్ స్రవంతి, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీధర్, యుగంధర్, హరి, బాలముని, కుమారస్వామి పాల్గొన్నారు.

తప్పులు లేకుండా ఈ క్రాప్ బుకింగ్

బుచ్చినాయుడుకండ్రిగ: తప్పులు లేకుండా ఈ–క్రాప్ బుకింగ్ చేయాలని మండల వ్యవసాయాధికారిణి భారతి తెలిపారు. ఆమె శనివారం వెస్టువరత్తూరు ఆర్బీకే సిబ్బందికి ఈ–క్రాప్ బుకింగ్‌పై అవగాహన కల్పించారు. ప్రతి రైతూ సాగు చేసిన పంటలను తప్పనిసరిగా ఈ క్రాప్ చేయాలని తెలిపారు. వైఎస్సార్‌సీపీ కార్మిక విభాగం జిల్లా కార్యదర్శి రవిరెడ్డి, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

బుచ్చినాయుడుకండ్రిగ: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు తెలిపారు. శనివారం పుత్తేరి, పీవీకండ్రిగ, ఆలత్తూరు గ్రామాల్లోని జగనన్న కాలనీలను పరిశీలించారు. హౌసింగ్ ఏఈ సుబ్రమణ్యం,ఏపీఓ భానుప్రియ పాల్గొన్నారు.

ఆదిదేవ ప్రణమామ్యహం



శ్రీకాళహస్తి: సూర్య భగవానుడికి అభిషేకం



నారాయణవనం: సూర్యప్రభ వాహనంపై కల్యాణ వెంకన్న

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం సమీపంలోని జలవినాయకస్వామి వద్ద ఉన్న శ్రీసూర్యభగవానుని ఆలయంలో శనివారం రథసప్తమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పలు రకాల అభిషేక పూజలు చేశారు. అనంతరం పట్టుపీతాంబరాలు, పరిమళభరిత పుష్పమాలికతో విశేషంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, వేదపండితులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యోగా గురువు భాస్కర్ అన్నారు. పట్టణంలోని శుకబ్రహ్మాశ్రమంలో శనివారం రథసప్తమిని పురస్కరించుకుని అభ్యసకులతో సూర్య నమస్కారాలు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాతో మానసిక ఆరోగ్యం, ఏకాగ్రత లభిస్తుందన్నారు. యోగా సాధకులు గరికపాటి రమేష్, గురుస్వామి, మునివేలు, కళ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు

ఏర్పేడు: వికృతమాల సంతాన సంపద శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో రథసప్తమి సందర్భంగా ధర్మకర్త పసుపులేటి హరిప్రసాద్, గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయ ఆవరణలోని సూర్యభగవానుడిని ఆలయంలో చైర్మెన్ నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు జరిగాయి. సంతాన సంపద వేంకటేశ్వరస్వామి ఆలయంలో సూర్యప్రభ వాహన సేవ వైభవంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నారాయణవనం: సూర్యజయంతిని పురస్కరించుకుని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి శనివారం సప్త వాహనాలను అధిరోహించి భక్తులను అనుగ్రహించారు. ఉదయం 6.30 గంటలకు సూర్యప్రభపై, తదుపరి వరుసగా చిన్న శేషవాహనం, పెద్దశేషవాహనం హంస, కల్పవృక్ష, తిరుచ్చి వాహనంపై విహరించారు. రాత్రి 7 గంటలకు చంద్రప్రభపై విహరిస్తూ భక్తుల నుంచి నీరాజనాలు అందుకున్నారు. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వేదనారాయణుని సన్నిధిలో..

పిచ్చాటూరు: నాగలాపురం శ్రీవేదవల్లీ సమేత వేద నారాయణ స్వామి ఆలయంలో శనివారం రథ సప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేదనారాయణ స్వామి మూల మూర్తులు, ఉత్సవమూర్తులను అభిషేకించి విశేషంగా అలంకరించారు. ఉదయం మత్స్యావతార మూర్తి శ్రీవేదనారాయణ స్వామి సూర్యప్రభ వాహనంపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం హంస, తిరుచ్చి, కల్పవృక్ష, పెద్దశేష, హంస వాహన సేవలు నిర్వహించారు. రాత్రి చంద్ర ప్రభ వాహనంపై తిరువీధి ఉత్సవం నిర్వహించారు.



శ్రీకాళహస్తి శుక బ్రహ్మాశ్రమంలో సూర్య నమస్కారాలు



పిచ్చాటూరు: సూర్యప్రభపై వేదనారాయణస్వామి



సూర్యప్రభపై సంతాన సంపద వేంకటేశ్వరస్వామి

గుండె నొప్పితో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని ఊరందూరు దళితకాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త దిద్దు భాస్కరయ్య(58) గుండెనొప్పితో శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు, భాస్కరయ్య దినసరి కూలీ. యథావిధిగా శుక్రవారం రైతుకు చెందిన పొలం పనులకు వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో గుండెనొప్పిగా ఉందని కుటుంబ సభ్యులకు తెలిపాడు. వెంటనే ఆస్పత్రికి ఆటోలో తీసుకుని వెళుతుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. జరిగిన సంఘటనను స్థానికులు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్థానికంగా ఆయన లేకపోవడంతో మృతుని కుటుంబానికి సాయం అందించాలని ఎమ్మెల్యే తల్లి దండ్రులు బియ్యపు గోవిందరెడ్డి, సుశీలమ్మకు చెప్పారు. వారు ఆ గ్రామానికి వెళ్లి వెళ్లి మృతదేహానికి నివాళి అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. దహనక్రియలకు రూ.10 వేలు సాయం అందించారు.



మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బియ్యపు గోవిందరెడ్డి, సుశీలమ్మ

జవహర్‌రెడ్డికి సాదర వీడ్కోలు

రేణిగుంట: రెండు రోజుల జిల్లా పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు తిరుగుపయనమైన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డికి శనివారం రాత్రి అధికారులు రేణిగుంట విమానాశ్రయంలో సాదర వీడ్కోలు పలికారు. కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జేసీ బాలాజీ, ఆర్‌డీవోలు కనకనరసారెడ్డి, కిరణ్‌కుమార్, తహసీల్దార్ ఉదయ్ సంతోష్ ఎయిర్‌పోర్ట్ అధికారులు వీడ్కోలు పలికారు.

శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించండి

శ్రీకాళహస్తి: పట్టణంలోని 13, 33, 34, 35వ వార్డుల పరిధిలో శనివారం తూర్పు రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్ సీపీ అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని ప్రచారం నాయకులు ప్రచారం చేశారు. నాయకులు జలదంకి మదన్‌మోహన్‌రెడ్డి, ఆర్కాడు శంకర్, మునిరామయ్య, రమేష్, వెంకటసుబ్బారెడ్డి, బాబు, నారాయణ, నాగేంద్రరెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, కిషోర్ రెడ్డి గౌరి, సూరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

కేవీబీపురం: ఉత్తమ అవార్డు అందుకున్న ఎంపీడీఓ రామచంద్ర,ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ దామోదర్ నాయుడు, డీటీ మునిరత్నం, బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్ మేనేజర్ ఆసిన్‌బాషాను శనివారం స్థానిక నాయకులు, ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గవర్ల కృష్ణయ్య, ఎంపీపీ మునిలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలుమునెమ్మ, నాయకులు నందకుమార్, లాల్‌బాబు యాదవ్, దశరథరామిరెడ్డి ఉన్నారు.

దాడిపై కేసు నమోదు

ఏర్పేడు: పెన్నగడం ఎస్సీ కాలనీ సమీపంలో దంపతులపై జరిగిన దాడిపై ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీహరి తెలిపారు. కాలనీకి చెందిన ఏకాంబరం శుక్రవారం భార్య సుశీలతో ద్విచక్ర వాహనంలో వెళుతుండగా, అదే కాలనీకి చెందిన బాలముని, సాగర్, యతిశంకర్, శ్రీధర్, కిరణ్‌కుమార్ దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

గడప గడపకూ సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మహిళలకు బుక్‌లెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం: ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలను అందించడమే ప్రభుత్వం లక్ష్యమని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. ఆయన శనివారం సాయంత్రం కొండలచెరువు సచివాలయ పరిధిలోని జోగిళ ఇళ్లు, కల్యాణపురం, పద్మావతిపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమస్యలు తెలుసుకున్నారు. వారు పొందిన లబ్ధిని వివరించారు. ఎంపీపీ దివాకర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సారకాయలు, సర్పంచులు భూపాల్‌రెడ్డి, మునెమ్మ, ఎంపీడీవో గుణశేఖర్, తహసీల్దార్ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడితే చర్యలు

ఏర్పేడు: ఉపాధిహామీ పనుల్లో సిబ్బంది అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ హెచ్చరించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ బహిరంగ సభ జరిగింది. తనిఖీల వివరాలను డీఆర్పీలు వివరించారు. పలుచోట్ల చనిపోయిన అవెన్యూ ప్లాంటేషన్, మామిడి మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటాలని పీడీ ఆదేశించారు. కొలతల వివరాలు, సంతకాల తేడాలపై రికవరీకి ఆదేశించారు. ఎంపీడీఓ గిడ్డయ్య, అంబుడ్స్‌మెన్ రాసరాయరాయుడు, డీపీఓ భాగ్యలక్ష్మి, ఏపీడీ సరిత, ఎస్సార్‌పీ కన్నారెడ్డి, ఏపీఓ దేవరి, ప్రజాప్రతినిధులు, కూలీలు పాల్గొన్నారు.

ఏపీ వైఎస్సార్ టీఎఫ్ క్యాలెండర్ల ఆవిష్కరణ



వరదయ్యపాళెం: స్థానిక ఎమ్మార్సీలో శనివారం ఏపీ వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ క్యాలెండర్లను జిల్లా కార్యదర్శి వై.సుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఎంఈఓ సరస్వతి ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు గోవిందస్వామి, వెంపళ్ల చిన్నయ్య, రామకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, గున్నయ్య పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

వరదయ్యపాళెం: మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్న నేపథ్యంలో పంటలు సాగు చేసిన రైతులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలని ఏవో సుహర్‌లత తెలిపారు. ఆమె శనివారం సంతవేలూరు, అంబూరు, మరదవాడ గ్రామాల రైతులకు అవగాహన కల్పించారు.